
Email : telanganaveenaoffcial@gmail.com


Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | శనివారం జూన్ ,14 ,2025 | సంపుటి:2 | సంచి 258 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-



# హృదయ విదారకం



## ప్రమాదస్థలాన్ని పరిశీలించిన మోడీ

- ప్రమాద వివరాలపై అధికారులతో ఆరా
- ప్రధాని వెంట సీఎం భూపేంద్రపటేల్, రామ్మోహన్ నాయుడు
- ఘటనపై విమనాశ్రయంలో అధికారులతో సమీక్ష
- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

**తెలంగాణవీణ,అహ్మదాబాద్..**

అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని ప్రధాని మోడీ పరిశీలించారు. ప్రమాద ఘటనలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం అహ్మదాబాద్ చేరుకున్నారు. ఘటనాస్థలానికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదస్థలిలో కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు, గుజరాత్

-మిగతా 2 లో



## తెలంగాణలో మరో ఐదు
# రోజులు భారీ వర్షాలు..!

ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

**తెలంగాణవీణ,హైదరాబాద్ ...**

రాష్ట్రంలో నైరుతి రుతు పవనాలు మళ్లీ చురుకుగా మారాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వానలు దంచికొడుతున్న సంగతి తెలిసిందే. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఈ నెల 14న నిర్మల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్,

-మిగతా 2 లో

## ఈ ఏడాది కొత్తగా 571
# పాఠశాలలు ప్రారంభం

### విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా బోధన



- హెచ్‌ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో పాఠశాలలు ఏర్పాటు
- పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యం
- అందుకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు
- అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్

**తెలంగాణవీణ,హైదరాబాద్...**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్.. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు

-మిగతా 2 లో



## సీటు విరిగి ఎగిరిపడడంతో
# బతికిపోయా

- అంతా క్షణాల్లో జరిగిపోయింది
- ఎలా బతికానో ఆశ్చర్యంగా ఉంది
- మృత్యుంజయుడు రమేశ్ విశ్వాస్ వెల్లడి
- ఆస్పత్రిలో రమేశ్‌ను పరమార్శించిన ప్రధాని మోడీ

**తెలంగాణవీణ,అహ్మదాబాద్...**

అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం యావద్దేశాన్ని విషాదంలో ముంచెత్తింది. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలపై ఏఐ-171 విమానం కుప్పకూలడంతో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. జరిగిందేమిటో తెలుసుకునే లోపు అందరి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. అయితే ఒక్కరు మాత్రం ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయపడి మృత్యుంజయుడుగా నిలిచారు. ఆ భయానక అనుభవాన్ని మీడియాతో

-మిగతా 2 లో




## అహ్మదాబాద్ ప్రమాదంలో
# బ్లాక్‌బాక్స్ లభ్యం

- దర్యాప్తులో కీలకం కానున్న డేటా

**తెలంగాణవీణ,అహ్మదాబాద్...**

అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానానికి సంబంధించి అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ లభ్యమైంది. భవన శిథిలాల నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నట్లు- ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో వెల్లడించింది. ప్రమాద ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి

-మిగతా 2 లో



## ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా
# రైతుభరోసా ఆగదు

- రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
- కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిన రేవంత్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుంది
- ఖమ్మం పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**తెలంగాణవీణ,ఖమ్మం**

ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా రైతు భరోసా విషయంలో వెనుకడుగు వేయబోమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి

-మిగతా 2 లో

# ఇరాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్




- అణు స్థావరాలే లక్ష్యంగా 200కుపైగా ఫైటర్‌జెట్స్‌తో దాడి
- ఆర్మీ చీఫ్ బాఘేరీ, రెవెల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ హతం
- పలువురు అణుశాస్త్రవేత్తలు మృతి
- ఇది ఆపరేషన్ రైజింగ్ లయన్

**తెలంగాణవీణ,దుబాయ్...**

పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంతో ఇప్పటికే ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, తాజాగా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం మొదలైంది. ఇరాన్ అణుస్థావరాలు లక్ష్యంగా శుక్రవారం ఉదయం ఇజ్రాయెల్ భీకర దాడులకు

-మిగతా 2 లో



## 9 ఏళ్లక్రితం కేసు కొట్టేయండి

- 20 కి వాయిదా వేసిన హైకోర్టు

**తెలంగాణవీణ,హైదరాబాద్,**

తొమ్మిదేళ్ల క్రితం గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తొమ్మిదేళ్ల క్రితం గోపన్‌పల్లిలోని

-మిగతా 2 లో

## కేటీఆర్‌కు మరోసారి
# ఏసీబీ నోటీసు జారీ..

### లై డిటెక్టర్ టెస్ట్‌కు సీఎం సిద్ధమా? కేటీఆర్ సవాల్



- ఏసీబీ నోటీసులపై రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు వస్తా
- ఓటుకు నోటు కేసుకు పదేండ్లు పూర్తయినయ్
- పరిపాలన చేతగాక రేవంత్‌రెడ్డి నాటకాలు
- ఇకనైనా కుటిల ప్రయత్నాలు మానుకో: కేటీఆర్

**తెలంగాణవీణ,హైదరాబాద్...**

ఫార్ములా-ఈ రేస్ కేసులో పదే పదే నోటీసుల డ్రామాలు ఆపి, లై డిటెక్టర్ టెస్ట్‌కు వచ్చే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈనెల 16 (సోమవారం)న విచారణకు రావాలని ఏసీబీ ద్వారా నోటీసులు పంపడంపై కేటీఆర్

-మిగతా 2 లో

# హృదయ విదారకం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం భూపేందర్ పటేల్ కూడా ఉన్నారు. అక్క వీరంతా కలియతిరిగి ప్రమాద తీరును పరిశీలించారు. విమానం కుప్పకూలిన ఆనవాళ్లను మోదీ నిశితంగా పరిశీలించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన తర్వాత మోదీ అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమాన ప్రయాణికుడు విశ్వాస్ కుమార్‌ను ప్రధాని పరామర్శించారు. గాయపడిన ఇతర మెడికోలతోనూ మోదీ మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆయన వెంట గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సంఘవి తదితరులు ఉన్నారు. అనంతరం ఈ ప్రమాదంపై మోదీ స్పందించారు. ఇది ఊహించని పెను విషాదమని, బాధిత కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలననంటూ విచారం వ్యక్తం చేశారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం ఉంటుందని, ఆ వేదనను మాటల్లోనే చెప్పలేమని అన్నారు. ఈ విషాద సమయంలో తన ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించేనని తెలిపారు. మరోవైపు ఎయిరిండియా ఎండీ, సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ కూడా ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బ్రిటిష్ హైకమిషన్ అధికారులు కూడా నేడు అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జాగిలాల సాయంతో మృతదేహాల కోసం శిథిలాల కింద గాలిస్తున్నారు. ఈ ప్రమాద సమయంలో విమానంలో మొత్తం 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒకే ఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడిగా బయటపడ్డారు. గుజరాత్ మాజీ సీఎం, భాజపా నేత విజయ్ రూపాణీ కూడా ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఇక, ఈ విమానం బీజే వైద్య కళాశాల మెడికోల వసతి గృహ సముదాయంపై కూలిన సంగతి తెలిసిందే. దీంతో అందులోని 24 మంది మృత్యువాత పడ్డారు. విమానంలో 169 మంది భారత పౌరులు కాగా.. 53 మంది బ్రిటన్‌వాసులు, ఇతర విదేశీయులు ఉన్నారు.

# ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభిస్తున్నామని సీఎం తెలిపారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు- నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థను మార్పు చేయాలని సీఎం రేవంత్ సూచించారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్‌ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ- ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్స్‌కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు- కుటుంబం, సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు మానసికంగా దృఢంగా తయారవడంతో పాటు- బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. అందరికీ విద్యనుచేరువ చేయాలన్న లక్ష్యంతో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు- నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేఅవుట్లలో ప్రజల అవసరాల కోసం కోటాయించిన స్థలాల్లో బడులు నిర్మించాలని ఆదేశించారు. గురుకులాల తరహాలో సౌకర్యాల కల్పనపై అధ్యయనం చేయాలని సూచించారు. డేస్కాలర్లకూ భోజనం, యూనిఫామ్, పుస్తకాల సరఫరాపై అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. పిల్లలకు కుటుంబం, సమాజంపై బాధ్యత తెలిసేలా కౌన్సిలింగ్ ఇప్పించాలని స్పష్టం చేశారు.

# సీటు విరిగి ఎగిరిపడడంతో బతికిపోయా

(మొదటి పేజీ తరువాయి)

పంచుకున్నారు. విమానం కూలిపోయిన భయానక క్షణాలను తలుచుకుని భారత సంతతికి చెందిన 40 ఏళ్ల బ్రిటిష్ పౌరుడు రమేష్ విశ్వాస్ కుమార్ రమేష్ చిగురుటాకులా వణికిపోయారు. ప్రస్తుతం ఆసుపత్రులో ఆయన చికిత్స పొందుతున్నారు. అకస్మాత్తుగా భవంతిలోకి విమానం దూసుకుపోయి పేలిపోయిందని, సెకండ్లలోనే అంతా జరిగిపోయిందని తెలిపారు. తన సీటు సమీపంలో భారీ డ్యామేజ్ జరిగిందని అన్నారు. సీటు ఊడిపోవడం తో పక్కకు పడడంతో తాను బతికానని అన్నారు. అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డారు విశ్వాస్ కుమార్ రమేశ్. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. ప్రమాద క్షణాలను గుర్తుచేసుకున్నారు. విమానం కూలగానే తాను కూర్చున్న సీటు- ఊడి పడిందని, అందువల్లే తాను బతికిబయటపడ్డానన్నారు. నేను విమానం నుంచి దూకలేదు. టేకాఫ్ అయిన కాసేపటికే విమానం ముక్కలైంది. నా సీటు విరిగిపోవడం తో దూరంగా ఎగిరిపడ్డా. అందుకే విమానంలో చెలరేగిన మంటలు నాకు అంటుకోలేదని విశ్వాస్ కుమార్ చికిత్స సమయంలో వైద్యులకు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆయన శరీరంపై పలుచోట్ల గాయాలు అయ్యాయి. వాటినుంచి కోలుకుంటున్న ఆయన తాజాగా మీడియాతో మాట్లాడారు. అంతా నా కళ్ల ముందే జరిగింది. ఎలా బతికానో నాకే అర్థం కాలేదు. విమానం కింద పడగానే నేను కూడా చనిపోయానని అనుకున్నా. కళ్లు తెరిచి చూసేసరికి హాస్టల్ భవనం శిథిలాల్లో ఉన్నా. శిథిలాల నుంచి మెల్లగా నడుచుకుంటూ వెళ్లా. మంటల ధాటికి నా ఎడమ చేయికి గాయమైంది' అని విశ్వాస్ తెలిపారు. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ ప్రయాణికుడిని శుక్రవారం ప్రధాని మోదీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్వాస్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్‌కుమార్.. గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటు-చేసుకుంది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలోని 11-ఏ సీటు-లో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. విశ్వాస్ ఒక్కడే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఈ ప్రమాదం వల్ల బీజే వైద్య కళాశాల వసతిగృహంలో మరో 24 మంది మృతి చెందారు.

## కేటీఆర్‌కు మరోసారి
# ఏసీబీ నోటీసు జారీ..

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించిన అనంతరం ప్రకటన విడుదల చేశారు. ఫార్ములా-ఈ రేస్ కోసం హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి పంపిన రూ.44 కోట్లు ఇప్పటికీ ఆ సంస్థ అకౌంట్‌లోనే ఉన్నాయని స్పష్టంచేశారు. వాటిని వెనకి తెప్పించడం చేతకాని సీఎం మరోసారి ఏసీబీ ద్వారా తనకు నోటీసులు పంపారని విమర్శించారు. హైదరాబాద్ నగరానికి, తెలంగాణకు ఎంతో పేరు తెచ్చిన ఫార్ములా-ఈ రేస్‌ను అర్థాంతరంగా రాజకీయ దురుద్దేశంతో రద్దు చేసి ఆ సంస్థ వద్ద ఉన్న రూ.44 కోట్ల ప్రజాధనాన్ని వెనకి తెచ్చే ప్రయత్నాన్ని ఉద్దేశపూర్వకంగా పకనపెట్టారని మండిపడ్డారు. నోటీసుల పేరుతో ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకునేందుకు కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



### చట్టాన్ని గౌరవించే పౌరుడిగా వస్తా..

తనకు ఎన్నిసార్లు నోటీసులిచ్చినా, విచారణ పేరుతో సాగదీసినా ఫార్ములా ఈ అంశం సంపూర్ణ పారదర్శకంగా జరిగిందని, ఈ విషయం అందరికీ తెలుసునని కేటీఆర్ తెలిపారు. తాజాగా మరోసారి ఇదే అంశంలో ఏసీబీ తనకు నోటీసులిచ్చిందని తెలిపిన కేటీఆర్, చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరై అన్ని విధాలుగా సహకరిస్తానని స్పష్టంచేశారు.

### లైవ్‌లో.. లై డిటెక్టర్‌కు సిద్ధమా?

పదేండ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రేవంత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని, ఆ కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉన్నదన్ని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇద్దరిపైనా ఏసీబీ కేసులున్నయి.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదురొనే దమ్మూ, ధైర్యం రేవంత్‌రెడ్డికి ఉన్నదా?' అని కేటీఆర్ సవాలు విసిరారు. 'లై డిటెక్టర్ టెస్టుకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా రేవంత్ రెడ్డీ' అని ప్రశ్నించారు. 'ఓవైపు మీ దివాలాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ముఖ్యమంత్రి అసమర్థతను చాటుకుంటున్న తరుణంలో.. విచారణల కోసం ప్రజాధనాన్ని వృథా చేయడం మానుకొని, వెంటనే లై డిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధం కావాలి' అని సవాల్ చేశారు.

# తెలంగాణలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు..!

(మొదటి పేజీ తరువాయి)

నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 15న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, 16, 17 తేదీల్లో ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో, 18న ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలు కురిసే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

## అహ్మదాబాద్ ప్రమాదంలో
# బ్లాక్‌బాక్స్ లభ్యం

(మొదటి పేజీ తరువాయి)

చెందిన 40 మంది సిబ్బంది పౌరవిమానయాన శాఖ బృందాలతో కలిసి పనిచేస్తున్నట్లు- తెలిపింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియలేదు. విమానంలో కీలకంగా ఉండే బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని విశ్లేషిస్తే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునే వీలు కలుగుతుంది. ప్రతి కమర్షియల్ విమానంలో రెండు బాక్స్‌లు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటాను రికార్డ్ చేయగా.. మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డుకు ఉపయోగపడుతుంది. విమానాలకు ఏదైనా ముప్పు వాటిల్లినప్పుడు, అత్యవసర పరిస్థితిని తెలియజేస్తూ 'మేడే' అంటూ సమీపంలోని ఏటీసీకి పైలట్ ఓ సందేశాన్ని పంపుతారు. వీటితోపాటు పైలట్-కోపైలట్‌ల సంభాషణలన్నీ డీఎఫ్‌డీఆర్‌లో రికార్డవుతాయి. ఈ డీఎఫ్‌డీఆర్‌నే బ్లాక్‌బాక్స్‌గా వ్యవహరిస్తారని ఏఏఐబీ తెలిపింది.

# 9 ఏళ్లక్రితం కేసు కొట్టేయండి

(మొదటి పేజీ తరువాయి)

వివాదాస్పద భూమిలో ఉన్న సొసైటీ- గదిని జేసీబీతో కూల్చివేశారని, కులం పేరుతో దూషించారని రేవంత్‌రెడ్డితో పాటు- ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మణ్‌పై పెద్ది రాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై పెద్దిరాజుకు నోటీ-సులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది.

## ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా
# రైతుభరోసా ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. రేగులచలక, కోయచెలక గ్రామాల్లో సీసీ రోడ్లు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కులగణన చేసిన దమ్మున్న నాయకుడు రేవంత్‌రెడ్డి అని అభివర్ణించారు. దేశమంతా పాదయాత్ర చేసి కులగణనకు ఆలోచన చేసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ చేసి మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఉద్ఘాటించారు. దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పాలనలో దేశమంతా రూ. 70 వేల కోట్లు రుణమాఫీ చేస్తే.. తెలంగాణలో రూ. 21 వేల కోట్లు- రుణమాఫీ చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తుచేశారు. ఇతర జిల్లాల వారు ఖమ్మంలో నివసించాలనే ఆలోచనలు వచ్చేలా ఖమ్మం నగరాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. అధికార పార్టీ వారు సర్పంచ్‌లు.. ఎంపీటీసీ జెడ్పీటీసీలుగా ఎన్నికైతే ప్రజలకు చేరువ కావొచ్చని మంత్రి చెప్పారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన రాజకీయ లక్ష్యమని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. రైతు సంక్షేమమే ప్రజా పాలన ధ్యేయమని చెప్పారు. పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని అన్నారు. ప్రజాభిమానం ఉంటే పదవులు అవే దక్కుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల రుణభారం తగ్గించేందుకు పాత రుణాల మాఫీ పూర్తయ్యిందని మంత్రి తెలిపారు.

# ఇరాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలువురు ఉన్నత సైనిక అధికారులు, శాస్త్రవేత్తలు మరణించగా, ఇరాన్ అణు, క్షిపణి స్థావరాలు ధ్వంసమైనట్టు తెలిసింది. ఇరాక్‌తో 1980లో జరిగిన భీకర యుద్ధం తరువాత తిరిగి ఆ స్థాయిలో దాడులను ఎదుర్కోవడం ఇరాన్‌కు ఇదే మొదటిసారి. ఈ దాడుల్లో ఇరాన్ సాయుధ దళాల ప్రధాన అధికారి జనరల్ మొహమ్మద్ బాఘేరి, రెవెల్యూషనరీ గార్డ్స్ జనరల్ హొస్సేన్ సలామీ, ఖండాంతర క్షిపణి కార్యక్రమం అధికారి జనరల్ అమీర్ అలీ హాజీజాదే, పలువురు శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు మృతి చెందారు. ఇరాన్ సైతం వెంటనే ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌పైకి వందకుపైగా డ్రోన్‌లను ప్రయోగించింది. ఇజ్రాయెల్‌కు 'తీవ్రమైన శిక్ష' తప్పదు అని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను పలు దేశాలు ఖండించాయి. వెంటనే ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఉభయ దేశాలు ప్రయత్నించాలని ప్రపంచ నాయకులు పిలుపునిచ్చారు. ఇరాన్ అణు కార్యక్రమంపై అట్టుడుకుతున్న అమెరికా, ఇజ్రాయెల్‌లు ఎప్పటినుంచి దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నాయి. పశ్చిమాసియా ప్రమాదకరంగా మారవచ్చని వ్యాఖ్యానించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సైనిక కుటుంబాలను, దౌత్య సిబ్బందిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్టు గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ అణు కార్యక్రమాన్ని అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు.

### టార్గెట్లు ఛిన్నాభిన్నం

దాదాపు 200 యుద్ధ విమానాలు ఇరాన్‌లోని 100కుపైగా లక్ష్యాలపై దాడులు చేశాయని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇక ఇరాన్‌లోనే తమ స్థావరాన్ని ఏర్పాటుచేసుకున్న ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ అక్కడి నుంచే టెహ్రాన్‌కు సమీపంలోని మిస్సైల్ లాంచర్లపై దాడులు చేసినట్టు తెలిపింది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగల ఆయుధాలను, వాహనాలపైనుంచి దాడులు చేసే వ్యవస్థను సెంట్రల్ ఇరాన్‌కు ఇంతకుముందే రహస్యంగా తరలించామని తెలిపింది. ఇక్కడి నుంచే ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థపై దాడి చేశామని పేర్కొంది.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



## ప్రధాని మోదీకి నెతన్యాహూ ఫోన్



**తెలంగాణవీణ,జెరూసలెం**
ఇరాన్‌పై దాడులకు అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రపంచ దేశాల నేతలతో మాట్లాడుతున్నారు. నెతన్యాహూ గురువారం రాత్రి నుంచి వివిధ దేశాల నేతలతో మాట్లాడుతున్నారు.ప్రధాని మోదీ, జర్మన్ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రన్ తదితరులతో మాట్లాడారు. ఇరాన్ నుంచి ఇజ్రాయెల్‌కు ఎదురవుతున్న ముప్పును ఈ నేతలు అర్థం చేసుకున్నట్లు నెతన్యాహు కార్యాలయం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ నెతన్యాహూ మాట్లాడతారని చెప్పింది.

## డీఎన్ఏకు 72 గంటలు.. తర్వాతే మృతదేహాల అప్పగింత



**తెలంగాణవీణ,అహ్మదాబాద్ ...**
విమాన ప్రమాద మృతులను గుర్తించడానికి వారి బంధువుల నుంచి డీఎన్ఏ సేకరించామని, ఆ నమూనాలను సరిపోల్చడానికి 72 గంటల సమయం పడుతుందని అధికారులు వెల్లడించారు.అది గుర్తించిన వెంటనే మృతదేహాలను వారివారి బంధువులకు అప్పగించే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటివరకు గుర్తించిన ఆరు మృత దేహాలను వారికుటుంబ సభ్యులకు అందజేసినట్టు పోలీసులు తెలిపారు. గురువారం పోస్ట్‌మార్గం నిమిత్తం 265 మృతదేహాలువచ్చాయన్నారు

## విజయ్ రూపానీ ఫ్యామిలీని పరామర్శించిన ప్రధాని మోదీ



**తెలంగాణవీణ,అహ్మదాబాద్**
అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ( ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు. భర్త మరణ వార్త తెలుసుకున్న లండన్‌లో ఉన్న విజయ్ రూపానీ భార్య అంజలి రూపానీ ఉదయం అహ్మదాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన ప్రధాని మోదీ.. రూపానీ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.లండన్‌లో ఉన్న కూతుర్ని కలిసేందుకు గుజరాత్ మాజీ సీఎం డ్రీమ్‌లైనర్ విమానం ఎక్కారు. గతవారమే ఆయన భార్య అంజలి రూపానీ లండన్ బయల్దేరి వెళ్లారు. అయితే కొన్ని పనుల కారణంగా విజయ్ రూపానీ ఇండియాలోనే ఉండాల్సి వచ్చింది. పనులు ముగించుకొని విజయ్ రూపానీ కూడా గురువారం లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఎక్కారు. విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే అది కూలిపోయింది. ఈ ఘటనలో విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ఉండగా, దాంట్లో 241 మంది మరణించారు. 2016 ఆగస్టు నుంచి 2021 సెప్టెంబర్ వరకు గుజరాత్ సీఎంగా రూపానీ బాధ్యతలు నిర్వర్తించారు.

# ఇరాన్‌పై ఇప్పుడే దాడి ఎందుకు?

-అణు'భయాలతోనే ఇజ్రాయెల్ దాడులు..
- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య 5 దశాబ్దాల వైరం



**తెలంగాణవీణ,జెరూసలెం...**
'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇరాన్‌లోని అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడులతో పశ్చిమాసియా అట్టుడుకిపోతున్నది. ఇజ్రాయెల్ ఇప్పటికిప్పుడు ఈ దాడులు చేయడానికి కారణం ఇరాన్ నిర్వహిస్తున్న 'అణు కార్యక్రమమే'నని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. రోజులవ్యవధిలో ఇరాన్ 15 అణుబాంబులను తయారు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నదని, ఇప్పటికిప్పుడు తొమ్మిది అణ్వాయుధాలను ఏర్పాటుచేయగల యూరేనియం నిల్వలు ఆ దేశంలో ఉన్నట్టు ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్తున్నాయి. ఇది తమ దేశ అస్తిత్వానికే ప్రమాదమని ఇజ్రాయెల్ భావించింది. పైగా అణు కార్యక్రమంపై ఓ ఒప్పందానికి రావాలంటున్న అమెరికా ప్రతిపాదనలను కూడా ఇరాన్ పట్టించుకోవట్లేదు. దీంతో ఇరాన్ 'అణు' సామర్థ్యాన్ని దెబ్బతీయాలన్న లక్ష్యంతోనే ఇజ్రాయెల్ ఇప్పటికిప్పుడు ఈ దాడులకు పాల్పడినట్టు అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**5 దశాబ్దాల నాటి వైరం!**
ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం ఈనాటిది కాదు. దాదాపు అర్ధ శతాబ్దం క్రితమే ఈ రెండు దేశాల మధ్య వైరం ప్రారంభమైంది. గతంలో అమెరికాతో జతకట్టిన పహ్లవీ రాజవంశం 1979లో ఇరాన్ ఇస్లామిక్ విప్లవంతో అధికార పీఠాన్ని కోల్పోయింది. అనంతరం ఇరాన్ పాలనా పగ్గాలను చేపట్టిన అయతుల్లా ఖమేనీ వర్గం అమెరికా పట్ల ద్వేషంతో మెలగసాగింది. నాటి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం క్రమంగా పెరిగింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తున్నదని ఖమేనీ ఆరోపిస్తూ వస్తున్నారు. దీంతో దశాబ్దాల నుంచే రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. కానీ, ఆ దాడుల్లో తమ ప్రమేయం లేదని రెండు దేశాలు ఖండించడంతో ఈ సంఘర్షణను 'షాడో వార్' అని పిలవడం మొదలుపెట్టారు.

# ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

పరిస్థితి చేయిదాటకముందే ఒప్పందానికి రండి..

**తెలంగాణవీణ,అమెరికా...**
ఇరాన్ తో అణు సమస్యను దౌత్య మార్గాల్లో పరిష్కరించుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఇప్పటికే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా అణు ఒప్పందంపై ఇరాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దాడులతో విపరీత పరిణామాలే తప్ప సాధించేదేమీ లేదని.. ఇకనైనా అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని హెచ్చరించారు.పరిస్థితి చేయి దాటకముందే తమతో చర్చలు జరపాలని ఇరాన్‌కు ట్రంప్ సూచించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల అనంతరం ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్‌కు అవకాశం తర్వాత అవకాశం ఇస్తూ వస్తున్నామని గుర్తుచేశారు. తమతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని ఎన్నిసార్లు సూచించినా టెహ్రాన్



అంగీకరించలేదని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని అత్యుత్తమ, అత్యంత ప్రాణాంతకమైన సైనిక పరికరాలను అమెరికా తయారు చేస్తోందని, అందులో చాలామటుకు ఇజ్రాయెల్ వద్ద ఉన్నాయని ట్రంప్ వెల్లడించారు. వాటిని ఎలా ఉపయోగించాలో కూడా ఇజ్రాయెల్‌కు తెలుసని, ఆ తర్వాత పరిస్థితి తాను ఊహించిన దానికంటే దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌లో ఇప్పటికే చాలామంది ప్రాణాలు కోల్పోయారని, భారీ విధ్వంసం జరిగిందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మారణహోమం మరింత దారుణంగా మారడానికి కొంత సమయం పడుతుందని, పరిస్థితులు చేయి దాటకముందే ఇరాన్ తమతో అణు ఒప్పందం చేసుకోవాలని సూచించారు. తాను చెప్పినట్లు చేస్తే ఇక మరణాలు, విధ్వంసాలు ఉండవని తెలిపారు. కాగా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న తాజా ఉద్రిక్తతలవల్ల పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్అవీవ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హుస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బఘేరి కూడా మరణించారు. ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం ప్రకటించారు.

## 16 ఎయిరిండియా విమానాల దారిమళ్లింపు





**తెలంగాణవీణ,ముంబై**
సుదూర ప్రాంతాలకు వెళ్లే 16 విమానాలను ఎయిరిండియా శుక్రవారం దారి మళ్లించింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ గగనతలం మూసివేత నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎయిరిండియా విడుదల చేసిన ట్రావెల్ అడ్వయిజరీలో, ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది.కొన్ని విమానాలను దారి మళ్లించినట్లు, మరికొన్ని అవి బయల్దేరిన విమానాశ్రయానికి తిరిగి చేరుకుంటాయని వెల్లడించింది. తమ విమాన సమయాల్లో మార్పులు ఉంటాయని ఇండిగో తెలిపింది.

GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

# విమాన ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభం

**తెలంగాణవీణ,అహ్మదాబాద్**
మేఘానీ నగర్‌లోని ప్రమాద స్థలాన్ని ఎన్ఐఏ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఒకరు మాత్రమే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. మిగిలిన మృతుల్లో ఎంబీబీఎస్ విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు ఉన్నారు. డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్ ధ్రుమిత్ గాంధీ శుక్రవారం



మాట్లాడుతూ, గాలింపు, సహాయ కార్యక్రమాలు ఉదయం ముగిసినట్లు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఫోరెన్సిక్ నిపుణులు, పౌర విమానయాన శాఖ అధికారులకు అప్పగించామన్నారు.


## సంపాదకీయం

# మితిమీరిన ట్రంపరితనం !

ట్రంప్ కాలుమోపి అప్పుడే ఆరునెలలు కావస్తోంది. ఈ ఆరు నెల్లలో అమెరికా పతననానికి పునాదులు వేశాడనే చెప్పాలి. అమెరికా ఫస్ట్ అన్న నినాదంతో చేస్తున్న చేష్టలు వెగటు పుట్టిస్తున్నాయి. ఎంతగా అంటే అమెరికన్‌లే ట్రంప్‌ను ఏకి పడేస్తున్నారు. అధ్యక్షుడి చర్యలను ఈసడించుకుంటున్నారు. చివరకు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఇలా లాస్‌ఎంజిల్స్‌లో ఆందోళనలు పరాకాష్టకు చేరిన నిరసనలుగా చూడాలి. వారిపై మిటిటరీని ప్రయోగించడం, విదేశీ హస్తం ఉందని చెప్పడం, ట్రంప్ చేతగాని పాలనకు నిదర్శనంగా చూడాలి. అమెరికాలో ఎప్పటినుంచో వలసవ చ్చి అకడే కూలీనాలీ చేసుకుంటున్న వారిపై దాష్టీకం ప్రదర్శించడం ట్రంప్‌కే చెల్లింది. నిజానికి వారు లేకుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఇతర దేశాల ప్రజలు చెమటోడ్చి అమెరికా ఆర్థికవ్యవస్థను నిలబెడుతున్నారు. ఇది ట్రంప్ గమనించక పోవడం దౌర్భాగ్యం. ట్రంప్ 'ప్రాజెక్టు 2025' పేరుతో అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల్లో భాగంగా అధికారంలోకి రాగానే అనేక అంశాల్లో వేలు పెడుతూ పోతున్నాడు. తనకు తోచిన నిర్ణయాన్ని ప్రకటి స్తున్నాడు. ఇతర దేశస్తలను పురుగుల్లాగా చూస్తున్నాడు.. అక్రమంగా వలస వచ్చిన వారిని స్వదేశాలకు పంపాలి. లేకపోతే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని ఇచ్చిన ఆదేశాలతో లాస్ ఏంజల్స్ నగరం ఇప్పుడు ఆందోళనలతో అట్టుడుకుతోంది. కొద్ది రోజులుగా అక్రమ వలసదారుల పేరుతో కొంత మందిని అరెస్టు చేసి జైల్లో పెట్టటంతో వారంతా వీధుల్లోకి వస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు ట్రంప్ సర్కార్ మిలిటరీని దింపింది. వలసదారులు శత్రు దేశాల మాదిరి లాస్ ఏంజల్స్‌ను ఆక్రమించుకున్నట్లుగా చిత్రించి నగరాన్ని విముక్తి చేయాలని ట్రంప్ ఆదేశించడం అవివేక చర్య తప్ప మరోటి కాదు. ఆ రాష్ట్ర గవర్నరే దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడు.. అక్రమ వలసదారులుగా చెబుతున్నవారు అమెరికాలో కోట్లాది మంది ఉన్నారు. అక్కడ తలెత్తిన ఆర్థిక, ఉపాధి సమస్యలను పరిష్కరించటంలో విఫలమైన పాలకులు వలస వచ్చిన వారే అన్నింటి కీ కారణమంటూ విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. కాకపోతే ఈ విషయంలో ట్రంప్ ముందున్నాడు. అక్రమ వలసదారులను ఏరివేసే పేరుతో ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నగరమంతటా వందలాది మందిని అరెస్టు చేయటాన్ని జనం నిరసిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి ఆందోళనలకు దిగారు. తమ అధికారాన్ని అతిక్రమించి మిలిటరీని దించటాన్ని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ న్యూసమ్ కోర్టులో సవాలు చేశాడు. వెనక్కు తగ్గేది లేదని ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ మరింతగా రెచ్చగొడుతూ ప్రకటించాడు. విదేశీ వ్యతిరేకత, ఉన్మాదాలను రెచ్చగొడుతున్నారు. కేవలం నిరసన ప్రదర్శనలు జరిగిన వెంటనే ట్రంప్ తీసుకున్న ఈ అసాధారణ చర్య ఏ పరిణామాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది.ట్రంప్ తీరుతో ప్రస్తుతం లాస్ ఏంజల్స్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. అణచివేత ఏ రూపం తీసుకుంటుందో, దానికి ప్రతిఘటనలో ఏం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. నిజానికి చౌకగా పని చేయించుకొని లాభాలు పొందేందుకు అమెరికా వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, వ్యవసాయ క్షేత్రాల వారు వలసలను ప్రోత్సహించారు. చట్టబద్ధం గా వచ్చిన వారితో పాటు అక్రమంగా వచ్చిన వారిని చూసీచూడనట్లు అధికార యంత్రాంగం వ్యవహరిం చింది. అయితే వీరంతా చెమటోడ్చడం వల్లనే అక్కడి ప్రగతిరథచక్రాలు కదులుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర తక్కువేమీ కాదు. వ్యవసాయం, సేవారంగం, నిర్మాణ రంగాలలో వారు కీలక పాత్ర పోషిస్తు న్నారు. ఇలాంటి వారివల్ల లాభాలు పొందుతున్న వారు మాత్రంకిమ్మనడం లేదు. వీరు వెళ్లిపోతే ఆయా పనులు చేసేందుకు అమెరికాలో ఒక్కరంటే ఒక్కరుకూడా మిగలరు. కరోనా తరువాత ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు, ద్రవ్యోల్బణం తగ్గటానికి వలస కార్మికులు తోడ్పడ్డారని డాలస్ ఫెడరల్ రిజర్వుబ్యాంకు అధ్యయనం తెలిపింది. అమెరికాలో పుట్టి పెరిగిన వారు ఉద్యోగ విరమణ చేయటం, జననాల రేటు తగ్గిన కారణంగా 2019-21 మధ్య 20 లక్షల మంది కార్మికులు తగ్గినట్లు, రానున్న పది సంవత్సరాలలో వలస కార్మికులు లేకపోతే వివిధ రంగాలలో ముఖ్యంగా వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో ఈ పరిణామం తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరికలు వెలువడ్డాయి. రానున్న సంవత్సరాల్లో వంట, ఇంటి పనివారు, డ్రైవర్లు, ఆరోగ్య, వ్యక్తిగత సంరక్షణ వంటి పనులు చేసేందుకు డిమాండ్ పెరగనుందని చెబుతున్నారు. వలస వచ్చిన వారి కారణంగానే స్థానికులకు అందాల్సిన సౌకర్యాలకు కోత పడుతున్నదని కొందరు సర్వేలు, బడ్జెట్ల పేరుతో రెచ్చగొట్టేందుకు పూనుకున్నారు. వలస వచ్చిన వారి గృహ వసతి కోసం న్యూయార్క్ వంటి నగరాల్లో బడ్జెట్ కేటాయింపులు చేస్తూ ఇతరులకు కోత పెడుతున్నారని చిత్రిస్తున్నారు. నిజానికి పైన చెప్పుకున్నట్లుగా వలస వచ్చిన వారి నుంచి వచ్చే రాబడితో పోల్చుకున్నపుడు ఇవి పెద్ద మొత్తాలేమీ కాదు. వారు పని చేస్తున్న పరిశ్రమలు, వాణిజ్య, వ్యవసాయ రంగాల నుంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం పన్నులు మరొక రూపంలో అదనంగా నిధులు సేకరించటాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ వారికి నానాటికీ మరిన్ని రాయితీలు ఇస్తున్నారు తప్ప అదనపు రాబడికి పూనుకోవటం లేదు. తక్కువ వేతనాలకు పని చేసే నైపుణ్యం అంతగా అవసరం లేని కార్మికులు ఇప్పుడు అమెరికాకు అవసరమని తెలిసినప్పటికీ ట్రంప్ వారి మీద దాడి ప్రారంభించాడు. లా÷- ఏంజిల్స్ భగ్గుమనడానికి కారణం కూడా ఇదే. ఎప్పుడో ఏళ్ల క్రితం వచ్చి అమెరికానే తమదేశంగా స్థిరపడిపోయిన వారిపై దాడి చేయడం దారుణం కాక మరోటి కాదు. వారు లేకుంటే ఏ పనీ నడవదని ట్రంప్‌కు కూడా తెలుసు. అయితే మూర్ఖుల నిర్ణయాలకు ప్రజలు బలి కావాల్సి ఉంటుందన్న నిజానన్ని ట్రంప్ రుజువు చేస్తున్నారు.

# లక్కీ నంబర్ 1206.. మరణం 12/06..

## విజయ్ రూపానీకి కలిసిరాని లక్కీ నంబర్



**తెలంగాణవీణ,న్యూఢిల్లీ**

ఎయిరిండియా విమాన దుర్ఘటనలో మృతి చెందిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ కూడా అదృష్ట సంఖ్యను నమ్ముతారు. 1206ను ఆయన తన లక్కీ నంబర్‌గా విశ్వసిస్తారు. ఆయన బైక్, కారు.. ఇలా వాహనమేదైనా ఆ నంబర్ ఉండాల్సిందే. ఆ సంఖ్య అంటే ఆయనకు అంత ఇష్టం. అయితే, కాకతాళీయమే అయినా అదే సంఖ్య ఆయన ఆయువును బలిగొన్నది. విమాన ప్రమాదం జూన్ 12న జరిగింది. అంటే.. 12/06. నిజానికి అది ఆయన లక్కీ నంబర్.కానీ, అదే రోజు ఆయన విమాన ప్రమాదంలో మరణించడం అందరినీ కలచివేసింది. పంజాబ్ బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్న విజయ్ రూపానీ లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు ఎయిరిండియా విమానమెక్కారు. నిజానికి ఆయన ఈ నెల 5 నుంచి 12 మధ్య లండన్‌లో పర్యటించాల్సి ఉన్నది. అయితే, లూధియానా వెస్ట్ ఉప ఎన్నిక కారణంగా దానిని వాయిదా వేసుకుని 12న ఆయన విమానమెక్కారు.

# అంబానీకి జెడ్ ప్లస్ భద్రతపై పిటిషన్ తిరస్కరించిన సుప్రీం



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ, అతని కుటుంబానికి అందిస్తున్న జెడ్ ప్లస్ భద్రతను సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ పిటిషన్‌ను వెనక్కితీసుకోవాలని పిటీషన్‌దారుడు బికాష్ సాహా అనే వ్యక్తిని ఆదేశించింది. అంబానీకి జెడ్ ప్లస్ భద్రతను వ్యతిరేకిస్తూ పదేపదే పిటిషన్లు వేస్తున్నందుకు సాహాను విమర్శించింది. ఈ పిటిషన్‌ను కొనసాగించినా, లేదా భవిష్యత్‌లో ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించింది. 'ప్రభుత్వం అందిస్తున్న భద్రతను సవాల్ చేయడానికి దరఖాస్తుదారునికి ఎటువంటి హక్కులేదు' అని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడి ద్వి సభ్య వెకేషన్ బెంచ్ పేర్కొంది. ముఖేష్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ, పిల్లలు అనంత్, ఆకాష్, ఇషాలకు అందిస్తున్న జెడ్ ప్లస్ భద్రతను కొనసాగించాలని సుప్రీంకోర్టు బెంచ్ పునరుద్ఘాటించింది. సాహా తన పిటిషన్‌లో అంబానీ, అతని కుటుంబానికి జెడ్ ప్లస్ భద్రతను ఉపసంహరించుకోవాలని కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. సాహా విజ్ఞప్తిని తోసిపుచ్చిన సుప్రీంకోర్టు "ముప్పు అవగాహనను నిర్ణయించడానికి మీరు ఎవరు? భారత ప్రభుత్వం దానిని నిర్ణయిస్తుంది. రేపు, ఏదైనా ప్రమాదం జరిగితే, మీరు బాధ్యత తీసుకుంటారా? లేదా కోర్టు దానికి బాధ్యత వహిస్తుందా?" అని ప్రశ్నించింది.

# నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణకు భారత్-చైనా అంగీకారం



**తెలంగాణవీణ,న్యూఢిల్లీ**

భారత్-చైనాల మధ్య నేరుగా విమాన సేవల పునరుద్ధరణను వేగవంతం చేయడానికి అంగీకారం కుదిరింది. ఈ విషయాన్ని ఇరు దేశాల విదేశాంగ మంత్రిత్వ శాఖలు శుక్రవారం ప్రకటించాయి. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి సన్ వీడాంగ్, కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీల మధ్య సమావేశం తరువాత ఈ విషయాన్ని ప్రకటించారు. ఇరుదేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకుంటున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. 'ఇరు దేశాల మధ్య వివాదాలను, విభేదాలను పరిష్కరించుకోవాలని, అంతర్జాతీయ, ప్రాంతీయ శాంతి, స్థిరత్వాలను కాపాడుకోవడంలో సంయుక్తంగా నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం' అని చైనా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే భారత మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో 'ఇరు దేశాల మధ్య సంబంధాలను స్థిరీకరించడానికి, పునర్నిర్మించడానికి సమావేశంలో అంగీకారం కుదరింది' అని తెలిపింది. కాగా, హిమాలయ సరిహద్దు వెంబడి పెట్రోలింగ్‌కు సంబంధించి ఇరు దేశాలు గత అక్టోబర్‌లో ఒక ఒప్పందానికి వచ్చాయి. దీంతో రెండు దేశాల మధ్య 2020లో ప్రారంభమైన ప్రతిష్టంభన తొలగిపోయింది. తరువాత వాణిజ్యం, సాంకేతికత, విమాన ప్రయాణం వంటి రంగాల్లో ఒప్పందాలపై భారత్‌చైనా దృష్టి పెట్టాయి.


# ఎసి, రిఫ్రిజిరేటర్లపై అమెజాన్ ప్రత్యేక ఆఫర్లు

**తెలంగాణవీణ,బెంగళూరు**




ఎసిలు, రిఫ్రిజిరేటర్లపై ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు ఇకామర్స్ దిగ్గజంఅమెజాన్ ఇండియా తెలిపింది. ప్రముఖ కంపెనీల బ్రాండ్ల ఉత్పత్తులపై రూ.20,000 వరకు తక్షణ తగ్గింపు డిస్కౌంట్, రూ.3000 వరకు కూపన్ డిస్కౌంట్లు, 18 నెలల వరకు నో కాస్ట్ ఇఎంఐ అవకాశాలను కల్పిస్తోన్నట్లు పేర్కొంది.

# విమాన ప్రమాద బాధితుల కోసం.. 300 మందికిపైగా సైనికులు రక్తదానం



**తెలంగాణవీణ,అహ్మదాబాద్**

ఎయిర్ ఇండియా విమానం ప్రమాద బాధితులకు సహాయం కోసం ఆర్మీ జవాన్లు ముందుకు వచ్చారు. 300 మందికిపైగా సైనికులు రక్త దానం చేశారు. అహ్మదాబాద్‌లోని మిలిటరీ కంటోన్మెంట్‌లో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని ఆర్మీ ప్రారంభించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విషాదకరమైన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో అందులో ఉన్న 241 మందితో పాటు పలువురు మెడికల్ స్టూడెంట్స్, స్థానికులు మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వారు చికిత్స పొందుతున్నారు.కాగా, ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి అవసరమైన రక్తాన్ని సమకూర్చేందుకు ఆర్మీ ముందుకు వచ్చింది. అహ్మదాబాద్‌లోని మిలిటరీ కంటోన్మెంట్‌లో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని ఆర్మీ ప్రారంభించింది. 300 మందికిపైగా ఆర్మీ జవాన్లతోపాటు అధికారులు రక్త దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. స్థానిక ఆసుపత్రులు, సేవా సంస్థల సమన్వయంతో బ్లడ్ డొనేషన్ డ్రైవ్ చేపట్టారు.

# ఎగిసిన చమురు ధరలు

## ఇరాన్-ఇజ్రాయిల్ ఉద్రిక్తతల ప్రభావం




**తెలంగాణవీణ,ముంబయి**

ఇరాన్‌పై ఇజ్రాయిల్ యుద్ధ దాడులు చమురు ధరలకు ఆజ్యం పోస్తోన్నాయి. మధ్యప్రాచ్యంలోని ఉద్రిక్తతలతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఎగిసిపడ్డాయి. ముడి చమురు బ్యారెల్ ధర ఓ దశలో 13 శాతం పెరిగింది. తుదకు 7 శాతం పెరిగి 75 డాలర్లుగా నమోదయ్యింది. ఇరాన్- ఇజ్రాయిల్ భౌగోళిక దాడులతో హర్మోజ్ జలసంధి ద్వారా జరిగే గ్లోబల్ చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడొచ్చనే ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరగడంతో పాటుగా ఆ రంగం కంపెనీల షేర్లు నష్టాలను చవి చూశాయి. బిపిసిఎల్ షేరు 5.75 శాతం నష్టంతో 312.90 వద్ద ముగిసింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేర్ 1.67 శాతం కోల్పోయి రూ.140.60 వద్ద నమోదయ్యింది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్ 1.60 శాతం నష్టంతో రూ.386.25 వద్ద ముగిసింది. ఒమన్- ఇరాన్ సముద్రమార్గంలో హర్మోజ్ జలసంధి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా రోజువారీ వినియోగంలో 21శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతుంది.

# ఇందిరమ్మ కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ పార్టీ

**మండల్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, కొండి శ్రీనివాస్**



**తెలంగాణ వీణ/చేగుంట**
మెదక్ జిల్లా, చేగుంట మండలం, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, చేగుంట మండల్ పోలంపల్లి గ్రామంలో శుక్రవారం నాడు ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబ లబ్ధిదారులకు గ్రామపంచాయతీ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి సహాయంతో లబ్ధిదారులకు అందజేయడం జరిగింది, లబ్ధిదారులు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం, మాకు సహాయం అందించడంతో మాకు సంతోషంగా ఉంది అలాగే మరి మిగతా ఉన్న లబ్ధిదారులకు, విడుదలవారీగా ఇవ్వాలని కోరుతూనము, మాకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసినందుకు, సంతోషపడుతున్నాము, మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మా గ్రామానికి మొదటి విడతగా, 15 ఇల్లు మంజూరు చేసినందుకు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మరియు గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్, మంత్రివర్యులు, దామోదర్ రాజనర్సింహ,కు మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు, కొండ సురేఖ కి ముఖ్యంగా మా ఆత్మీయ అన్నయ్య దుబ్బాక నియోజకవర్గ ముద్దుబిడ్డ అందరివాడు ఆత్మీయుడు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి అన్నకి పొలంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున, మరియు ఇందిరమ్మ కమిటీ తరపున వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము, ఈ కార్యక్రమంలో,గ్రామ కార్యదర్శి స్రవంతి, మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కొండి శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు కరె స్వామి, ఉపాధ్యక్షుడు కొండి మల్లేశం, చౌడం నర్సింలు, యట నరేష్, కొండి సౌందర్య,జె స్వామి,డి సురేష్, రాజు, యాదగిరి, ఆంజనేయులు, యాదగిరి,వెంకటి, సత్యనారాయణ, నర్సింలు, డి రాజు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# వల్లభాపూర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



**తెలంగాణ వీణ/ చేగుంట**
మెదక్ జిల్లా, చేగుంట మండలం ఎంపీపీఎస్ వల్లభాపూర్ పాఠశాలలో నూతనంగా విద్యా సంవత్సరంలోకి అడుగిడిన ఒకటవ తరగతి విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాన్ని ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, అంగన్వాడి టీచర్ శోభ, ఏఏపిసి సభ్యులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా చేరిన విద్యార్థిని విద్యార్థులకు పలక బలపం అందించి అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ప్రభుత్వం పాఠశాలలకు కల్పించే అన్ని మౌలిక సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కావున తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇరవైమూడేళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

**మస్తాన్ మిత్రబృందం అద్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం**



**తెలంగాణ వీణ/నాచారం:**



ఇరవైమూడేళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సందడిగా గడిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం వెస్లీ కో ఎడ్యుకేషన్ హై స్కూల్ 2001-2002 సంవత్సరంకు సంబంధించిన విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని మస్తాన్ మిత్రబృందం అద్వర్యంలో శుక్రవారం మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గురువులను సన్మానించి వారి ఆశీర్వాదాలను పొందారు.ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభిమానాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో గురువులతో మెలిగిన సందర్భాలను తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మస్తాన్, సాయి గౌడ్,నవీన్,విజయ్ కుమార్ రెడ్డి, తేలు మధు,రమేష్, వెంకటేష్,మురళి,హబీబ్ ,వీరేష్,శేఖర్ రెడ్డి,జీవ రత్నం,గడ్డం శేఖర్,సాయి కిరణ్, నర్సింగ్ రావు,శ్రీవిద్య, బిందు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలి

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్**
**-నేరాల నివారనే లక్ష్యంగా పని చేయండి**
**-వార్షిక తనిఖీల్లో భాగంగా సారంగాపూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**
**-గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి**
**-సారంగాపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు ,సిబ్బంది పనితీరు భేష్**





**తెలంగాణ వీణ,జగిత్యాల జిల్లా...**
ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ సూచించారు. వార్షిక తనిఖీ లో భాగంగా సారంగాపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని, బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చని అన్నారు. నేరాల నివారనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థుల పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసులపై రివ్యూ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5 S విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్నివిభాగాలు తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ, అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు.1993 సంవత్సరంలో సారంగాపూర్ మండలం బట్టపల్లి పోతారాం, నేరెళ్ల మధ్యదారిలో రోడ్డు పై మావోయిస్టులు అమర్చిన మందు పాత్రర పేలి అమరుడైన కానిస్టేబుల్ రాజయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులు ఘటించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రఘు చందర్,డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రూరల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ ,సారంగాపూర్ ఎస్.ఐ లు దత్తాద్రి, సదకర్, కుమారస్వామి, సుధీర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# వడియారం ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



**తెలంగాణ వీణ/ చేగుంట**
మెదక్ జిల్లా, చేగుంట మండలం వడియారం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధిరాములు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలోని ఐదు సంవత్సరాలు నిండిన బాల బాలికలను నమోదు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రియదర్శిని, వసంత, సంతోషిమాత, అమరేశ్వరి అంగన్వాడీ టీచర్లు రమ, రాణి, స్రవంతి, రేణుక మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సిద్దమ్మ పాల్గొన్నారు.

# ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలి

**-పెంచిన బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలి**
**-ఎస్ ఎఫ్ ఐ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజు కుమార్ గౌడ్,ఉపాధ్యక్షుడు తేజ,**




**తెలంగాణ వీణ,వికారాబాద్ జిల్లా...**
వికారాబాద్ జిల్లా కేంద్రంలో నీ బస్టాప్ లో నిరసన తెలియచేయడం జరిగింది అనంతరం ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో బస్ పాస్ ఛార్జీలు 20 శాతం పెంచడం సరికాదు గతంలో 1150 రూపాయలు ఉంటే ఇప్పుడు 1400 వందలకు పెంచింది రాష్ట్ర ప్రభుత్వం. జిల్లా లో మారు మూల ప్రాంతాలనుండి చదువుకోడానికి పేద విద్యార్థులు మండలాలకు అలాగే జిల్లా కేంద్రానికి వస్తుంటారు. ఇప్పటికే విద్యార్థులు బస్ పాస్ ఛార్జీలు కట్టలేక తల్లితండ్రుల పై ఒత్తిడి తెస్తుంది,బస్సు చార్జీలు తగించాల్సింది పోయి ప్రభుత్వం ఆర్టీసీ బస్ పాస్ చార్జీలను 20% పెంచడం సరికాదు అలాగే విద్యార్థుల పై ఒత్తిడి తీసుకురావడమే కాక విద్యార్థుల తల్లిదండ్రులు చెమట చిందించి పూట గడవక ఇబ్బంది పడుతూ విద్యార్థుల భవిష్యత్తు చదువు ఆ విద్య అందుకోవడానికి విద్యార్థులని విద్యార్థుల తల్లిదండ్రులు చెమటోడ్చి పనిచేస్తూ విద్యార్థులను చదువుల కోసం మండలాలలకి జిల్లా కేంద్రంలోనీ కళాశాలకు పంపడం జరుగుతుంది ఇట్లాంటి పరిస్థితులలో ఛార్జీల పెంపు నిర్ణయం సరికాదు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బస్ పాస్ చార్జీలను తగ్గించాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసులు అందించాలని అదే విధంగా ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి వాటిని సమయానికి అనుకూలంగా నడిపించాలని ఎస్ ఎఫ్ ఐ, వికారాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది లేని యడల పెద్ద ఎత్తున్న జిల్లాలో బస్లు నడవకుండా ఉద్యమాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ జిల్లా నాయకులు రెహాన్ సిద్దు,అభిషేక్,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# నక్సలైట్ల హింసాత్మక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

-ఏబీవీపీ



**తెలంగాణ వీణ/ఓయూ:** ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య పై గురువారం రాత్రి నక్సలైట్లు కత్తులతో, మరణ ఆయుధాలతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సిద్దిపేట జిల్లా, తన స్వగ్రామం అయ్యిన ఆరేపెల్లి గ్రామంలో తన వ్యవసాయ బావి దగ్గర నుండి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని ఆపి ఆపరేషన్ కాగర్ కి మద్దతు తెలుపుతూ నువ్వు నిరసన తెలియజేస్తావా, నక్సల్స్ కే వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తావా, నీ సంగతి చూస్తాం,మేము అంటే ఏందో చూపిస్తాం,అని దుర్భాషాలు ఆడుతూ తన పొట్ట పై మరియు తల పై కత్తులతో మరియు రాడ్లతో తీవ్రంగా దాడి చేసి పరారు కావడం నిజంగా బాధాకరం. ఇది నక్సలైట్ల పిరికిపంద చర్యల భావిస్తున్నాం , ఇలాంటి దాడులకు ఏబీవీపీ ఎప్పుడు వెనుకఅడుగు వేయదు,మీ కత్తులకు ,తుపాకులకు భయపడే కార్యకర్తలు ఏబీవీపీ లో లేరు, ఈ దాడి దేశభక్తి,విద్యార్థి ఉద్యమం పై దాడి ఇదే నక్సలైట్ల తుపాకీ తూటాలకు,కత్తి దాడులకు తెలంగాణ రాష్ట్రంలో 40 కి పైగా విద్యార్థి పరిషత్ కార్యకర్తలు చనిపోయిన విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్రంలో ఏనాడు వెనకడుగు వేయని విషయాన్ని నక్సలైట్లు గుర్తుంచుకోవాలి. ఈ దాడి నక్సలైట్ల అస్థిత్వం కోసం, ఓటమి భయంతో చేసిన దాడి, ఇలాంటి ఎన్ని దాడులకు అయ్యిన ఎదురు ఉండి పోరాడి నక్సలైట్లకు తుపాకీ తూటాల ద్వారానే రాజ్యాంధికారం అనే నీచపు , కాలం చెల్లిన సిద్ధాంతానికి తగిన గుణపాఠం చెప్పుతాం.

# ఇద్దరు కంటే సంతానం ఎక్కువ ఉండరాదు

సంతాన ఉత్పత్తి తగ్గుతుంది

పెళ్లి కోసం ఎదురు చూస్తున్నా యువత

ఎన్నికల నిబంధన వల్ల సంతనోత్పత్తి తగ్గుతుంది



**తెలంగాణ వీణ/ చేగుంట** మెదక్ జిల్లా, చేగుంట మండలం, స్థానిక సంస్థల ఎన్నికల లో ఇద్దరు సంతానం కంటే ఎక్కువ ఉండరాదు అనే నిబంధనను తీసివేయాలి ఈ నిబందనతొ ఎంతో మంది నాయకులు ప్రజలు ఒకరు లేక ఇద్దరు తో సరి పెట్టుకుంటున్నారు ఇప్పటి కే బందుత్వ వరుసలు కనుమరుగయ్యే పరిస్థితి కి వచ్చింది సంతానం ఉత్పత్తి తగ్గడంతో పెండ్లిలు కూడ కావడం లేదు ఎంతో మంది యువతి యువకులు వయస్సు పై బడి పెండ్లి ల కోసం ఎదురు చూస్తున్నారు ఈ నిబందన ప్రభుత్వ ఉద్యోగానికి, ప్రభుత్వం ఇచ్చే రాయితీలకు గాని లేని ఈ సంతాన నిబందన ఎన్నికల లొ పోటీ చేసే వారికి ఎందుకు వర్తించాలి ఇ నిబంధన గురించి ఇటు ప్రభుత్వాలు కానీ ఎన్నికల కమిషన్ గాని అలోచించి ఇట్టి నిబంధనను తొలగించాలని మీడియా సమావేశంలో చేగుంట భారతీయ జనతా పార్టీ మండల శాఖ తరుపున మండల పార్టీ అధ్యక్షుడు దొంత్తిరెడ్డి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు..

# ఏ ఐ సి సి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కలిసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ..





**తెలంగాణ వీణ/ఓయూ:** ఏ ఐ సి సి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, గుల్బర్గా ఎమ్మెల్సీ గౌరవ జగదేవ్ గుత్తేదార్ కర్ణాటకలోని గుల్బర్గాలో బుద్ధ విహార్ భవన్లో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శులు మాదు సత్యం గౌడ్ , డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్, మామిండ్ల భాస్కర్ గౌడ్, ఎస్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కృషి





-ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న.

**తెలంగాణ వీణ/తార్నాక:** పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని ఐసిడిఎస్ సికింద్రాబాద్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ జె. స్వప్న తెలియజేశారు. ఈ మేరకు మెట్టుగూడ సెక్టార్ చంద్రబాబునగర్ అంగన్వాడి 1, 2 కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మ మాట-అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లాలాపేట సత్యానగర్ కమ్యునిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సేవలను అందరూ ఉపయోగించుకోవాలనీ కోరారు. రెండున్నర నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులను తప్పకుండా అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ స్కూల్లలో అనవసరంగా వేల రూపాయలు, లక్షల రూపాయల ఫీజులు చెల్లించే బదులు అంగన్వాడి కేంద్రాలకు పంపించడం ద్వారా ఇక్కడ ఆటా, మాట, కథ ద్వారా స్వేచ్ఛాయుత వాతావరణ పద్ధతిలో ప్రీ స్కూల్ విద్యను బోధించడం జరుగుతందన్నారు. ప్రభుత్వం ప్రీ స్కూల్కు సంబంధించిన బోధన పరికరాలును అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. గుడ్, బ్యాడ్, సామాజిక ఎదుగుదలకు కావాల్సిన అంశాలను నేర్పిస్తామన్నారు. దీంతో పాటుగా పిల్లల ఎదుగుదలకు కావాల్సిన పౌష్టిక ఆహారాన్ని సైతం అందజేస్తామన్నారు.పిల్లల ఎదుగుదలకు కావాల్సిన పౌష్టిక ఆహారాన్ని సైతం అందజేస్తామన్నారు. తాజాగా ప్రభుత్వం వారంలో రెండు రోజులు పిల్లలకు ఎగ్ బిర్యాణి సైతం పెట్టేందుకు మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. ఈ విధంగా ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అంగన్వాడి కేంద్రాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఏ. రేణుక, మెట్టుగూడ సెక్టార్ చంద్రబాబునగర్ 1. 2 అంగన్వాడి కేంద్రాల టీచర్లు వి. కృపావతి, బి. సంధ్యా రాణి, మహిళా సమాఖ్య నాయకురాలు తిరుమల రేణుక, అనిత, అంగన్వాడి టీచర్ రోజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# కర్నాల్ పల్లిలో సామూహిక అక్షరాభ్యాసం



**తెలంగాణ వీణ /చేగుంట** మెదక్ జిల్లా, చేగుంట మండలం కర్నాల్ పల్లి ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ అక్షరాభ్యాసం పొందిన విద్యార్థులు భవిష్యత్తులో మంచి విద్యాబుద్ధులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలచందర్, సంపత్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గౌతమి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే అధిక దిగుబడులు

కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల శాస్త్రవేత్త మాలతి



**తెలంగాణ వీణ,నర్సింహులపేట...** అవగాహనతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల శాస్త్రవేత్త మాలతి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పంటల సాగుపై అవగాహన కల్పించారు.యూరియా అధిక వినియోగంతో ఆమ్ల తత్వం పెరిగి భూమిలోని సూక్ష్మజీవులు నశిస్తాయని,ఎరువులను మోతాదుకు మించి వేయవద్దని చెప్పారు.పంటల మార్పిడిని పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు.వరి వేసే ముందు పచ్చి రొట్టె పంటలు వేయాలని పెసర్లు,బొబ్బర్లు,మినుముల సాగుతో పప్పు దినుసుల అవసరాలు కూడా తీరుతాయని చెప్పారు.వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం,పరిష్కార మార్గాలు తెలుసుకోవాలన్నారు.మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని మరియు రసీదులు జాగ్రత్తగా భద్ర పరుచుకోవాలని ఆదికృత లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక నెంబర్ ను రైతులు తమ పేరు మరియు ఫోన్ నెంబర్ తో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్యాల శాస్త్రవేత్తలు క్రాంతి కుమార్,కిషోర్ కుమార్,ఉద్యాన వన అధికారి మానస,వ్యవసాయ విస్తరణ అధికారులు శరత్ చంద్ర,కళ్యాణి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి బలోపేతానికి కృషి చేయాలి.

బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ బోసుపల్లి ప్రతాప్.



**తెలంగాణ వీణ,మహేశ్వరం,** బిజెపి పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ మండల ఇన్చార్జి బోసుపల్లి ప్రతాప్ అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండల పరిధిలోని నాగారం గ్రామంలో కుండె వెంకటేష్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు టి. యాదిష్ అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన గురించి వివరించారు. నరేంద్ర మోడీ పాలనలో ప్రధానిగా అనేక సంక్షేమ పథకాలను తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. మేకిన్ ఇండియా, స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో దేశాన్ని మరింత ముందుకు తీసుకురావడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ అగ్ర దేశం లో జిడిపి ని 11 వ స్థానం నుండి 4 వ స్థానానికి తేవడం జరిగిందని ఆయన అన్నారు. రైతులకు ఎరువులను సబ్సిడీ ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. పేదలకు ఉచిత రేషన్ బియ్యం పథకం తీసుకొచ్చి మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొక్క నరసింహారెడ్డి, పాపయ్య గౌడ్, కడారి జంగయ్య యాదవ్, సుదర్శన్ రెడ్డి, అనంతయ్య గౌడ్, యాదయ్య గౌడ్, మాధవాచారి, కుండె వెంకటేష్, కుమార్, సుదర్శన్ యాదవ్, కాసాని వెంకటేష్ గౌడ్, దేశా నాయక్, మంత్రి ముత్యం, మనోహర్, శ్రీనివాస్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలి.

వీపీ గౌతమ్ ఐఏఎస్ హౌసింగ్ సెక్రటరీ.



**తెలంగాణ వీణ,మహేశ్వరం..** గడువులోగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని వీపీ గౌతమ్ ఐఏఎస్ హౌసింగ్ సెక్రటరీ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిరాలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల ను ఆయన పరిశీలించారు. అధికారుల సూచన మేరకు ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వాణిరెడ్డి , హౌసింగ్ డిఈ బిక్కు నాయక్, ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్ వో మేనేజర్ సౌమిక్ కుమార్, ఆర్ ఐ మల్లేష్ వార్డు అధికారులు పాల్గొన్నారు.

# బిజినెస్

# మళ్లీ లక్ష దాటేసిన పసిడి..
# ఒక్క రోజే రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం ధర

**తెలంగాణవీణ,బిజినెస్...**
శుక్రవారం భారతదేశంలో బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. భారతదేశంలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాములకు రూ.2,120 పెరిగింది. దీనితో బంగారం ధర లక్ష దాటింది. అదే సమయంలో వెండి కూడా తగ్గేదేలే అన్నట్లు ఎగబాకుతోంది. కిలో వెండి ధరపై రూ.1,100 పెరిగింది. ఇటీవల కూడా లక్ష రూపాయలు దాటేసిన పసిడి ధరలు.. తర్వాత క్రమంగా దిగి వచ్చాయి. కానీ మళ్లీ ఇప్పుడు అదే జోరు కొనసాగిస్తోంది. లక్ష రూపాయలు దాటడంతో వినియోగదారులకు కొనేందుకు వెనుకాడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర $3,426.62గా ఉంది. అలాగే 1 గ్రాము బంగారం ధర $ 110.17గా ఉంది. అదే సమయంలో వెండి ఔన్సుకు $ 36.06 స్థాయిలో నడుస్తోంది.
ప్రస్తుతం దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01,400 రూపాయలకు చేరుకుంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 92,950 రూపాయల వద్ద ట్రేడవుతోంది. ఇక వెండి ధర విషయానికొస్తే.. కిలో వెండి ధర 1 లక్ష 10 వేల రూపాయల వద్ద కొనసాగుతోంది. ఇక హైదరాబాద్, చెన్నై, కేరళ ప్రాంతాల్లో మాత్రం మరింతగా ఉంది.



కిలో వెండి ధర 1 లక్షా 20 వేల వరకు ఎగబాకింది.

**బంగారం, వెండి ధరలు భారీగా పెరగడానికి ప్రధాన కారణాలు:**
అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుదల: నేడు బంగారం ఔన్సుకు రికార్డు స్థాయిలో $ 3,426.62కి చేరుకుంది. ఇది ప్రపంచ మార్కెట్‌లో అస్థిరత, ఆర్థిక ఆందోళనలను సూచిస్తుంది. వెండి కూడా ఔన్సుకు $36.06కి చేరుకుంది. ఇది పెట్టుబడిదారుల సురక్షిత ఆస్తుల పట్ల ఆసక్తి పెరుగుతున్నట్లు సూచిస్తుంది.
డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గింది: నేడు 1 US డాలర్ ధర రూ.85.72, ఇది రూపాయి బలహీనతను చూపుతుంది. బలహీనమైన రూపాయి కారణంగా భారతదేశంలోకి దిగుమతి చేసుకునే బంగారం, వెండి ఖరీదైనవిగా మారాయి.
**ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు:** మధ్యప్రాచ్యం (ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం) అలాగే ఉక్రెయిన్-రష్యా వివాదం వంటి కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఎగబాకుతోంది.
**కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు :** ప్రపంచ ఆర్థిక అనిశ్చితి కారణంగా అనేక దేశాల కేంద్ర బ్యాంకులు నిరంతరం బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. ఇది ధరలను బలపరుస్తోంది.
భారతదేశంలో పెట్టుబడులు, వివాహాల సీజన్: జూన్ నెలలో అనేక రాష్ట్రాల్లో వివాహ వేడుకలు జరుగుతాయి. దీని వల్ల స్థానికంగా బంగారం డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా, ద్రవ్యోల్బణం నుండి తమను తాము రక్షించుకోవడానికి పెట్టుబడిదారులు కూడా బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు.
స్టాక్ మార్కెట్లు, క్రిప్టోకరెన్సీలలో క్షీణత : ఇటీవలి కాలంలో స్టాక్ మార్కెట్లు, క్రిప్టోకరెన్సీలు అస్థిరతను చూస్తున్నాయి. దీనివల్ల పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి సురక్షితమైన ఎంపికల వైపు మొగ్గు చూపుతున్నారు.

## కుప్పకూలిన విమానయాన షేర్లు

- ఎయిరిండియా దుర్ఘటనతో ఒత్తిడి
-సెన్సెక్స్ భారీ పతనం



**తెలంగాణవీణ,బిజినెస్,ముంబయి**
అహ్మదాబాద్ లో ఎయిరిండియా ఘోర ప్రమాదంతో గురువారం విమాన యాన రంగ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొ న్నాయి. అమెరికాకు చెందిన విమానాల తయారీ కంపెనీ బోయింగ్ కో షేర్ ఇంట్రాడేలో ఏకంగా 8 శాతం పతనమయ్యింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్ విలువ 3.32 శాతం లేదా రూ.187 పతనమై రూ.5,444కు తగ్గింది. ఇంట్రాడేలో 5,418 కనిష్టాన్ని తాకింది. స్పైస్‌జెట్ షేరు విలువ 1.78 శాతం నష్టంతో రూ.44.68 వద్ద ముగిసింది. అమెరికా ప్రీ మార్కెట్‌లో బోయింగ్ షేర్ 5.83 శాతం క్షీణించి 214 డాలర్లుగా నమోదయ్యింది.
అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవి చూశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 823 పాయింట్లు లేదా 1 శాతం క్షీణించి 81,691.98కి పడిపోయింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 253 పాయింట్లు లేదా 1.01 శాతం నష్టంతో 24,888 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 1000 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 24,900 దిగువన ట్రేడింగ్ అయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభ పడ్డాయి. టాటా మోటార్స్, టైటాన్, ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, ఎంఅండ్‌ఎం, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, ఐటీసీ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

## సరికొత్త టెక్నాలజీని తీసుకొచ్చిన ఎయిర్‌టెల్..

**తెలంగాణవీణ,బిజినెస్...**
తెలంగాణలోని ఎయిర్‌టెల్ కస్టమర్లు సైబర్ మోసాలకు గురి కాకుండా సదరు సంస్థ అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. AI-ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టమ్‌ను ప్రవేశపెడుతోంది. దేశవ్యాప్తంగా 180,000 హానికరమైన లింక్‌లను విజయవంతంగా బ్లాక్ చేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 5.4 మిలియన్‌కు పైగా వినియోగదారులను రక్షించింది. కేవలం 25 రోజుల్లోనే ఈ ఘనత సాధించింది. తెలంగాణలో ఆన్ లైన్ మోసాలపై ఎయిర్‌టెల్ ఉక్కుపాదం మోపింది. ఈ క్రమంలో సుమారు 180,000 హానికరమైన లింక్‌లను బ్లాక్ చేసింది. తద్వారా రియల్ టైమ్‌లో 5.4 మిలియన్ యూజర్లను కాపాడనుంది. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నుండి తెలంగాణలోని కస్టమర్లను రక్షించాలనే లక్ష్యంలో గణనీయమైన పురోగతిలో భాగంగా, భారతీ ఎయిర్‌టెల్ యొక్క తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ సీఈవో అజయ్ అనంతపద్మనాభన్.. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఐపీఎస్ డైరెక్టర్ శ్రీమతి శిఖా గోయెల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు AI ఆధారిత టూల్ గురించి వివరించారు. ఈ సందర్భంగా భారతీ ఎయిర్‌టెల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఈఓ అజయ్ అనంతపద్మనాభన్ మాట్లాడుతూ.. తమ కస్టమర్లను అన్ని రకాల మోసాల నుండి రక్షించడం తమ బాధ్యత అని చెప్పారు. ఈ అత్యాధునిక ఫీచర్‌ను కస్టమర్లకు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారుల అత్యవసర అవసరాలను తీర్చడంతో పాటూ సృజనాత్మక పరిష్కారాలను అందించేందుకు AI -ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టమ్ అవసరమన్నారు. ఈ కొత్త ఇంటెలిజెన్స్ తెలంగాణలోని వినియోగదారులను సైబర్ మోసాల నుండి రక్షిస్తుందని తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఐపీఎస్, డీజీ శిఖా గోయెల్ మాట్లాడుతూ తెలంగాణలో సైబర్ మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ఎయిర్‌టెల్ చర్యలు తీసుకోవడం అభినందనీయమని ప్రశంసించారు.

# స్పోర్ట్స్

# అలెన్ రికార్డుల జాతర

**తెలంగాణవీణ,క్రీడలు :కాలిఫోర్నియా**
అమెరికాలో క్రికెట్ అభిమానులను అలరించేందుకు జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) మూడో సీజన్ ఘనంగా ఆరంభమైంది. సాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ మధ్య కాలిఫోర్నియాలో శుక్రవారం రాత్రి జరిగిన తొలి మ్యాచ్‌లో.. యూనికార్న్స్ బ్యాటర్ ఫిన్ అలెన్ రికార్డుల మోత మోగించాడు. 34 బంతుల్లోనే సెంచరీ చేసిన ఈ కివీస్ ఓపెనర్..మొత్తంగా మ్యాచ్‌లో 51 బంతుల్లో 5 బౌండరీలు, 19 భారీ సిక్సర్లతో 151 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో అలెన్.. ఒక టీ20 మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రిస్ గేల్ (18) రికార్డును అధిగమించాడు. అలెన్ దూకుడుతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 269/5 రన్స్ చేసింది. ఛేదనలో వాషింగ్టన్.. 13.1 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలి 123 పరుగుల తేడాతో భారీ ఓటమిని మూటగట్టుకుంది



## సెంచరీతో చెలరేగిన మార్క్రమ్!
## గద ఎత్తేందుకు కొద్ది దూరంలోనే బవుమా..

-రాణించిన బవుమా
-తేలిపోయిన ఆసీస్ పేసర్లు
-విజయానికి 69 పరుగుల దూరంలో దక్షిణాఫ్రికా
-లక్ష్యం 282.. ప్రస్తుతం 213/2

**తెలంగాణవీణ,క్రీడలు :లండన్**
దశాబ్దాల ఐసీసీ ట్రోఫీ కలను నెరవేర్చుకునేందుకు దక్షిణాఫ్రికా వడివడిగా ముందుకు సాగుతున్నది. సెషన్ సెషన్‌కూ ఆధిక్యం చేతులు మారుతున్న ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడుతున్న ఆ జట్టు.. 'గద'ను చేజిక్కించుకునేందుకు గాను 69 పరుగుల దూరంలో నిలిచింది. లార్డ్స్ వేదికగా జరుగుతున్న డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 282 పరుగుల ఛేదనలో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీలు 213/2తో గెలుపు దిశగా సాగుతున్నారు. ఓపెనర్ ఎయిడెన్ మార్క్మ (159 బంతుల్లో 102



నాటౌట్, 11 ఫోర్లు) తన కెరీర్‌లో చిరస్మరణీయ శతకంతో కదం తొక్కగా కెప్టెన్ టెంబ బవుమా (121 బంతుల్లో 65 నాటౌట్, 5 ఫోర్లు) అదరగొట్టడంతో సఫారీలు లక్ష్యానికి చేరువయ్యారు. అంతకుముందు ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకు ఆలౌట్ అయింది. మిచెల్ స్టార్క్ (58 నాటౌట్) పోరాడాడు. ఆట తొలి రెండు రోజుల మాదిరిగా కాకుండా మూడో రోజు పూర్తిగా ఎండ కాయడంతో బౌలర్ల పప్పులేమీ ఉడకలేదు. రెండ్రోజుల్లో 28 వికెట్లు తీసిన ఇరు జట్ల పేసర్లు.. మూడో రోజు తీసింది మూడు వికెట్లే.. మరో రెండ్రోజుల ఆట మిగిలిఉన్న ఈ మ్యాచ్‌లో ఏదైనా అద్భుతం జరిగితే తప్ప దక్షిణాఫ్రికా గెలుపును అడ్డుకోవడం కంగారూలకు కష్టమే!

**నిలబడ్డ మార్క్మ, బవుమా..**
భోజన విరామానికి వెళ్లొచ్చి 282 పరుగుల ఛేదనను ఆరంభించిన సఫారీలకు మూడో ఓవర్లోనే తొలి దెబ్బ తగిలినా తర్వాత నిలబడింది. మార్క్మత్రో పాటు మల్డర్ (27), బవుమా నిలకడ ముందు కంగారూల ఆటలు సాగలేదు. మూడో ఓవర్లో స్టార్క్.. రికెల్టన్ (6)ను ఔట్ చేసి దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టే యత్నం చేశాడు. కానీ మార్క్మ,( మల్డర్ (27) ఆసీస్ పేసర్లపై ఎదురుదాడికి దిగారు. వన్డే తరహాలో ఆడిన ఈ ద్వయం.. ఆసీస్ పేస్ త్రయంతో పాటు స్పిన్నర్ లియాన్‌ను సమర్థవంతంగా అడ్డుకోవడమే గాక ఓవర్‌కు 4 పరుగుల రన్‌రేట్‌ను మెయింటెన్ చేస్తూ లక్ష్యం దిశగా సాగింది. తొలి ఇన్నింగ్స్‌లో నిరాశపరిచిన మార్క్మ.( సెకండ్ ఇన్నింగ్స్‌లో మాత్రం కంగారూలకు ఎలాంటి అవకాశమూ ఇవ్వలేదు.

## ఉప్పల్‌లో భారత్, కివీస్ టీ20 మ్యాచ్!



**తెలంగాణవీణ,క్రీడలు :ముంబై**
హైదరాబాద్ క్రికెట్ అభిమానులకు తీపి కబురు! నగరంలోని ఉప్పల్‌లో ఉన్న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం మరో ధనాధన్ పోరుకు ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది జనవరిలో భారత పర్యటనకు రానున్న న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా ఇక్కడ ఒక టీ20 మ్యాచ్ ఆడనుంది. మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడేందుకు గాను కివీస్ జట్టు జనవరిలో భారత్‌కు రానుంది. ఈ మేరకు బీసీసీఐ.. హైదరాబాద్‌తో పాటు జైపూర్, మొహాలి, ఇండోర్, రాజ్‌కోట్, గువహతి, త్రివేంద్రం, నాగ్‌పూర్ వేదికలను ఖరారు చేసినట్టు సమాచారం. శనివారం జరుగబోయే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం అనంతరం ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ వెలువడనుంది. ఉప్పల్‌లో చివరిసారిగా భారత్.. నిరుడు అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ ఆడగా ఆ పోరులో టీమ్‌ఇండియా ఏకంగా పొట్టి క్రికెట్‌లో తమ అత్యధిక పరుగుల రికార్డు (297/6)ను నమోదుచేసిన విషయం విదితమే.








## ఓటీటీలోకి వచ్చేసిన 'రానా నాయుడు 2'..

### స్ట్రీమింగ్ ఎక్కడంటే.!

**తెలంగాణవీణ,సినిమా :** విక్టరీ వెంకటేష్, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ సీజన్ 2 తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉంది. అమెరికన్ సిరీస్ రే డోనవన్‌కి రీమేక్‌గా వచ్చిన ఫస్ట్ సీజన్ మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీనికి కొనసాగింపుగా రెండో సీజన్‌ను తీసుకువచ్చారు మేకర్స్.కరణ్ అంశుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో సుర్వీన్ చావ్లా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, గౌరవ్ చోప్రా, ప్రియ బెనర్జీ, రాజేష్ జైస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

## ఏంటి.. నిహారిక సైలెంట్‌గా నిశ్చితార్థం చేసుకుందా..

### త్వరలోనే రెండో పెళ్లి..!

**తెలంగాణవీణ,సినిమా :** మెగా డాటర్ ముద్దుల కూతురు నిహారిక గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. యాంకర్‌గా అదరగొట్టిన నిహారిక ఆ తర్వాత నటిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది.కొణిదెల నిహారిక 2015 నుంచి తెలుగు చిత్ర పరిశ్రమలో యాక్టివ్ గా ఉంటోంది. ఒక మనసు చిత్రంతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత హ్యాపీ వెడ్డింగ్, సూర్యకాంతం, సైరా నర్సింహా రెడ్డి, డార్లింగ్, వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. కానీ ఈ అమ్మడు నటించిన ఏ చిత్రం కూడా బ్లాక్ బాస్టర్ హిట్స్ ను అందుకోలేకపోయింది. మరోవైపు పలు వెబ్ సిరీస్ ల్లోనూ నటించినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. డెడ్ పిక్సెల్స్, బెంచ్ లైఫ్ వంటి సిరీస్ ల్లో నటించిన కూడా సక్సెస్ అందుకోలేకపోయింది.ఇక నిర్మాతగా తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమైన ఈ ముద్దుగుమ్మ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ లో నిర్మించిన కమిటీ కుర్రాళ్లు చిత్రంతో బ్లాక్ బాస్టర్ హిట్ ను సొంతం చేసుకుంది. రూ.10 కోట్లతో నిర్మించిన ఈ చిత్రానికి రూ.25 కోట్ల గ్రాస్ కలెక్ట్ అయ్యింది. ఇక తెలుగులో మనోజ్ నటిస్తోన్న "వాట్ ది ఫిష్" అనే సినిమాలో నిహారిక హీరోయిన్‌గా ఎంపికైంది. ఈ సినిమా అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా నిహారికకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. నిహారిక సీక్రెట్‌గా నిశ్చితార్థం చేసుకుందని, త్వరలోనే రెండో పెళ్లి చేసుకోనుందంటూ ప్రచారం ఊపందుకుంది. నిహారిక కొణిదెల తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన ఒక ఫొటో ప్రస్తుతం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ ఫొటో చూస్తుంటే ఏదో శుభకార్యం, పూజ లేదా నిశ్చితార్థం వంటి వేడుకకు సంబంధించినదిగా కనిపిస్తోంది.ఈ ఫొటోలో నిహారిక పట్టుచీర ధరించి సంప్రదాయబద్ధంగా కనిపించారు. ఆ ఫొటో చూస్తే నిహారిక నిశ్చితార్థం చేసుకున్నదనే చర్చ నడుస్తోంది. పూర్తి ఫొటో పోస్టు చేయకుండా కేవలం చేయి.. పూలు కనిపించేలా షేర్ చేసి నెటిజన్ల మెదడుకు పదును పెట్టింది. అది కచ్చితంగా నిశ్చితార్థం ఫొటో అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలానే నిహారిక నిశ్చితార్థం న్యూస్ కూడా వైరల్‌గా మారింది.





## ఆ స్టార్ హీరో సరసన శ్రీనిధి.. ఎవరంటే..

**తెలంగాణవీణ,సినిమా :** దక్షిణాదిలో మోస్ట్ పాపులర్ హీరోయిన్లలో ఆమె ఒకరు. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు వరుస హిట్స్ ఖాతాలో వేసుకుంటుంది. అంతేకాకుండా ఇప్పుడిప్పుడే తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అవకాశాలు సొంతం చేసుకుంటుంది. తనే హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కేజీఎఫ్ సినిమాతో కన్నడ సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. తొలి చిత్రమే పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ అయ్యింది. ఆ తర్వాత కోబ్రా సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఇక ఇటీవలే హిట్ 3 సినిమాతో మరో విజయాన్ని అందుకుంది. న్యాచురల్ స్టార్ నాని నటించిన ఈ సినిమాతో తెలుగు సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. మరోసారి అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. దీంతో ఇప్పుడు తెలుగులో ఈ బ్యూటీకి మరిన్ని ఆఫర్స్ రానున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ అమ్మడుకు మరో క్రేజీ ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. లేటేస్ట్ టాక్ ప్రకారం ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో సినిమాలో ఈ అమ్మడు నటించనున్నట్లు సమాచారం.తాజాగా కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టికి తమిళంలో భారీ ఛాన్స్ వచ్చింది. అదేంటంటే.. తమిళ్ స్టార్ హీరో అజిత్ త్వరలో నటించనున్న తన 64వ సినిమాలో శ్రీనిధిని ఎంపిక చేశారని టాక్. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. ఇటీవలే గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో హిట్ అందుకున్న అజిత్.. ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం రెడీ అవుతున్నారు. విడాముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాల తర్వాత ఇప్పుడు అజిత్ చేయబోయే సినిమాపై మరింత హైప్ నెలకొంది. అజిత్ 64వ చిత్రానికి కూడా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారని నివేదికలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నవంబర్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదల చేయనున్నారు. ఇక ఇప్పుడు ఈ సినిమాలో కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి నటించనున్నట్లు టాక్. ఈ సినిమాను పాన్ ఇండియా లెవల్లో రూపొందించనున్నారు.

## ప్రభాస్ 'రాజా సాబ్' టీజర్ లీక్..

### టీమ్ హెచ్చరిక!

**తెలంగాణవీణ,సినిమా :** పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ . టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ 16న టీజర్ విడుదల చేయనున్నారు మేకర్స్. అయితే టీజర్ రాకముందే దీనికి లీకుల బెడద మొదలైంది. ఈ టీజర్‌లోని కొన్ని సన్నివేశాలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో లీక్ అయినట్లు తెలుస్తుంది. దీంతో ఈ విషయంపై చిత్రబృందం తాజాగా స్పందిస్తూ.. నెటిజన్లకు హెచ్చరిక జారీ చేసింది.ఎవరైనా 'రాజాసాబ్' కంటెంట్‌కు సంబంధించిన అనధికారిక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే, వారి సోషల్ మీడియా అకౌంట్‌ను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. సినిమాటిక్ అనుభూతిని అందించడానికి చిత్రబృందం ఎంతో కష్టపడుతోందని, దీనికి అందరూ సహకరించాలని కోరింది.


Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written